సాక్షి విశాఖపట్నం

సోమవారం । 28 । జూలై । 2025



సంకల్పమే శ్వాసగా..

సంకల్పం ఉండాలే కాని దానిని సాధించడంలో ఎన్ని కష్టాలు, అవరోధాలు ఎదురైనా లక్ష్యంపై గురి తప్పదని నిరూపించారు దివ్యాంగులు. పుట్టుకతోనే దివ్యాంగత్వం ఉన్నా ఆత్మవిశ్వాసంతో వాటిని అధిగమించి ఇష్టమైన రంగంలో సత్తాచాటుకుంటున్నారు. ఆంధ్రా యూనివర్సిటీ జిమ్నాజియం గ్రౌండ్‌లో అథ్లెట్స్ జట్ల ఎంపిక నిర్వహించారు. దివ్యాంగులు పరుగు పందెం, హైజంప్, డిస్కస్‌త్రో, లాంగ్ జంప్‌లో పోటీపడ్డారు. తమ ప్రతిభను చాటుకున్నారు.

-ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

8లో



● సందడే సందడి

అసలే ఆదివారం.. ఆపై అందాల నగరిలో అద్భుతమైన వాతావరణం.. ఇంకేముంది సాగర తీరం పర్యాటకులతో సందడిగా మారింది. చిన్నా పెద్ద ఆర్కే బీచ్‌లో అలలపై ఆడిపాడారు. యువకులు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు.

-ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

● శివస్తుతితో కావడియాత్ర



8లో

పరమ శివుడు అభిషేక ప్రియుడు. చెంబుడు గంగా జలంతో అభిషేకిస్తే సంతోషించే శివయ్యకు మార్వాడీలు కావిళ్లతో గంగాజలాన్ని మోసుకెళ్లి అభిషేకించారు. శ్రావణ మాసం మొదటి ఆదివారం సందర్భంగా మార్వాడీలు కావడి యాత్ర నిర్వహించారు. మాధవధారలోని జలధార నుంచి పవిత్ర జలాలను సేకరించారు. కాషాయ వస్త్రాలు ధరించి, శివుడిని పూజిస్తూ, కావడిని భుజాన మోసుకుంటూ ప్రారంభమైన యాత్ర బీచ్‌లోని శివాలయం వద్దకు చేరుకుంది.

-ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఉక్కు కార్మికుల్ని బ్లాక్ చేసేశారు..!



మూడు దశాబ్దాలుగా ఆ పరిశ్రమనే నమ్ముకున్నారు. ఉక్కుతోనే జీవితం అని భావించారు. అర్థంతరంగా వారిని జీవన కర్మాగారం నుంచి దూరం చేసేశారు. దీంతో నాలుగు వేల మంది కార్మికులు కుటుంబాలతో రోడ్డున పడ్డారు. దేశంలో ఏ పరిశ్రమలోనూ లేని విధంగా మరోసారి ప్లాంట్‌లో అడుగుపెట్టనీయకుండా కార్మికులకు 'ఆధారం' దొరక్కుండా 'బ్లాక్' చేసేశారు. ప్లాంట్ మనుగడ కోసమే కార్మికులను తొలగించామని చెబుతున్న యాజమాన్యం .. వారి స్థానంలో ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకొచ్చి నియమించడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

- స్టీల్‌ప్లాంట్‌లో అడుగు పెట్టనీయకుండా కుట్ర
- దేశంలో ఎక్కడా లేని విధంగా ఆధార్ కార్డ్ బ్లాక్
- ఏ ఏజెన్సీలోనూ పనిచేయనీయకుండా ఆంక్షలు
- 4 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను రోడ్డున పడేసిన యాజమాన్యం
- కొత్తగా ఒడిశా, జార్ఖండ్‌కు చెందిన వెయ్యి మందికిపైగా ఉపాధి కల్పన
- మండిపడుతున్న ఉద్యోగ, కార్మిక సంఘాలు

సాక్షి, విశాఖపట్నం : ఓవైపు ఉక్కు పరిశ్రమను ఉద్ధరిస్తామంటూ చంద్రబాబు సర్కారు ఊదరగొడుతూ.. మరోవైపు సంస్థను మరింత కుంగదీసేందుకు కేంద్ర ప్రభుత్వంతో కలిసి కుయుక్తులు పన్నుతోంది. ఇప్పటికే నష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న స్టీల్ ప్లాంట్.. ఉద్యోగులకు జీతాలు సక్రమంగా చెల్లించలేని దుస్థితికి చేరుకుంది. ఏకంగా 305 శాతం జీతాలు బకాయిలుగా ఉంచేసి.. ఉద్యోగుల ఆర్థిక స్థితిని అగమ్యగోచరంగా మార్చేసింది. ఇప్పటికీ సీనియర్లకు 75 శాతం, మధ్యస్థ ఉద్యోగులకు 80 శాతం వేతనం మాత్రమే చెల్లిస్తోంది. ఓవైపు కేంద్ర గనుల శాఖ మంత్రి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఇప్పట్లో జరగదని బాహాటంగా చెబుతుంటే.. మరోవైపు ప్లాంట్‌ను నిర్వీర్యం చేసే పనులను కూటమి ప్రభుత్వం చాపకింద నీరులా చేసుకుంటూ పోతోంది. ఇటు ప్రజలు.. అటు ఉద్యోగుల ఆందోళనలు.. ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నిరసనలను ప్రభుత్వం ఏమాత్రం ఖాతరు చేయడం లేదు. ఎన్ని కుయుక్తులు పన్నుతున్నా.. వెరవకుండా ఏళ్లతరబడి ఉద్యమాలు చేసి.. స్టీల్‌ప్లాంట్‌ని కాపాడుకునేందుకు శ్రమిస్తున్న ఉద్యోగులు, కార్మికుల ఆర్థిక మూలాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దెబ్బకొడుతున్నాయి. పోరాటం చేస్తున్న వారి ఆత్మస్థైర్యాన్ని, ఆర్థిక ఆసరాని ఛిద్రం చేస్తే.. ఉద్యమాన్ని నీరుగార్చొచ్చన్న కుతంత్రంతో ప్రభుత్వం వ్యవహరిస్తోందన్న విషయం.. జీతాల చెల్లింపులతో బట్టబయలవుతోంది. దీనికి తోడు కాంట్రాక్టు కార్మికులపైనా వేటు వేసింది. కొద్ది నెలల క్రితం ఏకంగా 4 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను అర్థంతరంగా తొలగించేసి నడిరోడ్డున పడేసింది. 30 శాతం కాంట్రాక్టు కార్మికులను తక్షణం విధుల నుంచి వెనక్కి పంపుతూ వారి గేట్‌పాస్‌లను వెనక్కి తీసుకుంది. దీనిపై కాంట్రాక్టు కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టినా యాజమాన్యం మరింత కఠినంగా వ్యవహరించింది.

ఆధార్ కార్డూ బ్లాక్‌లో పెట్టేశారు..!

ఫిట్‌గా లేరని కొందర్ని.. పనిరాదంటూ మరికొందర్ని తొలగించడంతో 4 వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. పైగా కార్మిక, ఉద్యోగుల సంఘాల నాయకులు ఆందోళన చేస్తుండటంతో ప్లాంట్ యాజమాన్యం మొండి వైఖరి ప్రదర్శించింది. స్టీల్‌ప్లాంట్‌లో గల దాదాపు 600 ఏజెన్సీల్లో కొంతమంది చొప్పున వేటు వేసింది. బయోమెట్రిక్‌లో పేరు తొలగించేసింది. పైగా వీరందరి ఆధార్ కార్డులను బ్లాక్ చేయాలంటూ ప్లాంట్ యాజమాన్యం ఏజెన్సీలను ఆదేశించింది. దీంతో వారు మరో ఏజెన్సీలో చేరి ప్లాంట్‌లోకి ప్రవేశించడానికి వీలు లేకుండా చేసేసింది. అంటే ఈ 4 వేల మందికీ ప్లాంట్‌లో పని దొరికే అవకాశం లేదు. దేశంలో ఏ పరిశ్రమలోనూ ఈ తరహా నిరంకుశ వైఖరి లేదని కన్నీటి పర్యంతమవుతున్నారు.

ఇతర రాష్ట్రాల కార్మికులెందుకో..?

కాస్ట్ కటింగ్ పేరుతో కార్మికుల తొలగింపు చేపట్టిన ప్లాంట్.. ఇప్పుడు ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను దిగుమతి చేసుకోవడంపై సర్వత్రా మండిపడుతున్నారు. తొలగించిన వారి స్థానంలో స్కిల్డ్ కార్మికులు లేక.. ఉత్పత్తికి అంతరాయం ఏర్పడుతుండటంతో ఏం చేయాలో పాలుపోక.. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి కాంట్రాక్టు కార్మికుల్ని నియమించుకోవాలంటూ ఏజెన్సీల్ని ప్లాంట్ ఆదేశించింది. ఇప్పటి వరకూ 1000 మందికి పైగా కార్మికుల్ని ఈ రెండు రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి.. ప్లాంట్‌లో ఉపాధి కల్పించారు. దీనిపైనా ఉద్యోగ, కార్మిక సంఘాలు యాజమాన్యంతో పోరాటం సాగిస్తున్నా.. పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్లాంట్ యాజమాన్య వ్యవహార శైలిపై కూటమి ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులకు చివరికి సీఎం, డిప్యూటీ సీఎంకి మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు దశాబ్దాలుగా ప్లాంట్‌నే నమ్ముకొని.. కుటుంబాలను నడిపించిన వారంతా.. వేరే పని తెలియక.. కుటుంబాల్ని పోషించుకోలేక అల్లాడిపోతున్నారు. వీరికి న్యాయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా ముందుకు రాకపోవడంపై కార్మిక సంఘ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మాట వినకుంటే వేటే..!

ఈపీడీసీఎల్ చిరుద్యోగులపై టీడీపీ ఎమ్మెల్యే ప్రతాపం

ఆగమేఘాలపై ఏఈ, ఏడీఈల బదిలీ

- అంచనాలు లేకుండా పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్లు మార్చాలంటూ ఎమ్మెల్యే హుకుం
- ఉన్నతాధికారుల నుంచి అనుమతి రాగానే చేసేస్తామన్న ఏఈ, ఏడీఈ
- వారిని వెంటనే బదిలీ చేయించి.. తనకు అనుకూలంగా ఉన్న వారికి పోస్టింగ్



సాక్షి, విశాఖపట్నం : 'ఇది నా నియోజకవర్గం.. నేను చెప్పిందే అంచనా.. నేను చెప్పిందే పని.. అడ్డొస్తే.. ఇక్కడ ఉండరు. జాగ్రత్త..' ఈపీడీసీఎల్ ఉద్యోగులపై ఓ కూటమి సీనియర్ ఎమ్మెల్యే రుబాబిది. హెచ్చరించినట్లుగానే.. చిరుద్యోగులపై తన ప్రతాపాన్ని చూపించారు. తాను చెప్పినట్లు వినలేదని ఇద్దరు ఉద్యోగులను ఆగమేఘాల మీద బదిలీ చేయించి.. తనకు నచ్చిన వారికి పోస్టింగ్‌లు ఇప్పించేసుకున్నారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పని చేసిన ఆయన తన దగ్గర నిబంధనలు పనిచేయవన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. సదరు ఎమ్మెల్యే వ్యవహార శైలితో ఆ ప్రాంతంలో పనిచేసేందుకు ఈపీడీసీఎల్ ఉద్యోగులు జంకుతున్నారు.

ఎమ్మెల్యే ఆగ్రహానికి ఏఈ, ఏడీఈ బలి..!

ఇటీవల తన నియోజకవర్గంలో పర్యటించిన ఎమ్మెల్యే ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్ లైన్ వెంటనే మార్చాలని ఈపీడీసీఎల్ ఏఈ, ఏడీఈలను ఆదేశించారు. ఎస్టిమేషన్స్ సిద్ధం చేస్తామని వారు చెప్పారు. కానీ ఎమ్మెల్యే వినిపించుకోకుండా ప్రజల ముందరే వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తర్వాత రోజు ఒక వీధిలో పోల్స్ సాయంత్రానికల్లా మార్చాలని ఆదేశించారు. ఇది కూడా వెంటనే చేయడం సాధ్యం కాదనీ.. అంచనాలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని.. అక్కడి నుంచి అనుమతి రాగానే మార్చేస్తామని సమాధానమిచ్చారు. దీంతో ఎమ్మెల్యే ఇగో హర్ట్ అయ్యింది. నేను చెప్పినా.. అంచనాలు గించనాలు అని సమాధానమిస్తారా అంటూ సదరు ఏఈ, ఏడీఈపై చిందులేశారు. నా మాట లెక్క చెయ్యని మీరు.. ఇక్కడెలా ఉంటారో చూస్తానంటూ హెచ్చరించారు. అక్కడి నుంచే ఈపీడీసీఎల్ ఉన్నతాధికారితో ఫోన్‌లో మాట్లాడి.. ఏఈ, ఏడీఈల్ని సాయంత్రానికల్లా ట్రాన్స్‌ఫర్ చేయాలని ఆర్డర్ వేశారు. నేను ఏం చెబితే.. అది చేసే ఏఈ, ఏడీఈ పేర్లు మీకు మెసేజ్ చేస్తున్నా.. వారికి పోస్టింగ్ కూడా ఇవ్వాలని హుకుం జారీ చేశారు. ఇంకేముంది అక్కడ ఎవరిది తప్పో కనీసం విచారణ చేపట్టకుండా.. ఏఈ, ఏడీఈ వెర్షన్ తెలుసుకోకుండా.. విద్యుత్ శాఖ ఉన్నతాధికారి.. బదిలీ ఆర్డర్ వారి చేతిలో పెట్టేశారు. ఎమ్మెల్యే చెప్పిన వారిని అక్కడికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసేశారు.

వామ్మో.. ఆ ఎమ్మెల్యే నియోజకవర్గంలోనా..?

సదరు ఎమ్మెల్యే నియోజకవర్గంలో పనిచేయాలంటే విద్యుత్ ఉద్యోగులు భయపడుతున్నారు. లైన్‌మెన్ దగ్గర నుంచి.. పై స్థాయి ఉద్యోగి వరకూ ఎవరైనా.. ఆయన ఏ పని చెబుతారోనంటూ బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పనిచేయడం తమ వల్ల కాదని చెప్పేవాళ్లకు బదిలీ ఆర్డర్‌ని చేతిలో పెడుతున్నారు. అయితే.. కొత్తగా విధుల్లో చేరిన ఇద్దరు ఉద్యోగులూ ఎమ్మెల్యేకు వీర విధేయులే అయినా.. అడ్డగోలుగా పనులు ఎలా చేస్తారో చూస్తామని తోటి ఉద్యోగులే వ్యాఖ్యానించడం కొసమెరుపు.

ఆస్పత్రులు, క్లినిక్‌ల రిజిస్ట్రేషన్ గడువు ఆగస్టు 5

మహారాణిపేట: విశాఖ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నడుస్తున్న ఆస్పత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, స్కానింగ్, ఫెర్టిలిటీ కేంద్రాలు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్–2002/2007 ప్రకారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం(ఆన్‌లైన్)లో తమ వివరాలు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. రిజిస్ట్రేషన్ లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని ఆదివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. నమోదు గడువు ఆగస్టు 5గా పేర్కొన్నారు. ఆస్పత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు https://clinicalesttact.ap.gov.in/ వెబ్‌సైట్‌లో, స్కానింగ్ కేంద్రాలు https://pcpndt.ap.gov.in/ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

నేటి పీజీఆర్‌ఎస్‌కు రెవెన్యూ శాఖ మంత్రి

మహారాణిపేట: కలెక్టరేట్‌లో సోమవారం జరగనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్)కు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ రానున్నారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌తో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు మంత్రి అందుబాటులో ఉంటారని అధికారులు తెలిపారు.

విప్లవోద్యమానికి తొలి గొంతుక చలసాని

సీతంపేట : కామ్రేడ్ చలసాని ప్రసాద్ మనుషుల పట్ల అచంచలమైన ప్రేమ, ఆప్యాయత చూపేవారని, ఆయన జీవితం మొత్తం విప్లవ పంథాలోనే ముగించారని పలువురు వక్తలు కొనియాడారు. విరసం వ్యవస్థాపకుడు చలసాని ప్రసాద్ పదో వర్ధంతి సభ ఆదివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. చలసాని చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎస్సార్ ప్రసాద్ మాట్లాడుతూ మనసు ఫౌండేషన్ డిజిటలైజేషన్‌కు పాఠకులు ఎవరైనా వెళ్లి తమకు నచ్చిన పుస్తకం చదవొచ్చు, డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. విరసం అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ మాట్లాడుతూ చలసాని సేకరించిన సుమారు 8,500 పుస్తకాలను మనసు ఫౌండేషన్ స్కాన్‌చేసి డిజిటలైజేషన్ చేయడం సిపిబుక్స్.ఓఆర్‌జి వెబ్‌సైట్‌లో పొందుపర్చడం, ఆ వెబ్‌సైట్‌ను నా చేతుల మీదుగా ప్రారంభం కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా శాంతి చర్చలు, విప్లవ పంథా పేరిట సదస్సు నిర్వహించారు. చలసాని జీవితం తాత్వికతపై ప్రజాస్వామ్య రచయితల వేదిక నాయకురాలు మల్లీశ్వరి ప్రసంగించారు. కవి బాలసుధాకర్ రాజకీయార్థిక సంక్షోభం నేపథ్యంలో యాభై ఏళ్ల కళింగాంధ్ర కవితపై ప్రసంగించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి, పీవోడబ్ల్యూ లక్ష్మి, మధు, వేణుమాస్టర్, టి.శ్రీరామమూర్తి, ప్రసాద వర్మ, మానం ఆంజనేయులు, లలిత, చందు సుబ్బారావు, కత్తి పద్మ, ఇష్టా ప్రసాద్ మాట్లాడారు.



చలసాని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

'సీబీసీఎన్‌సీ నియామకాలపై హైకోర్టు ఆగ్రహం'

దాబాగార్డెన్స్: సీబీసీఎన్‌సీలో నకిలీ నియామకాలపై సీబీసీఎన్‌సీ పునర్నిర్మాణ కమిటీ సభ్యుడు మాసా ఆగస్టిన్ మెషాక్ కోర్టును ఆశ్రయించినట్లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అడ్డగోలు నియామకాలపై ఏపీ ప్రధాన న్యాయస్థానం సీరియస్ అయిందన్నారు. చట్టబద్ధత లేని కమిటీ ఏర్పాటు చేసుకుని నియామకాలు జరపడం ఏంటని ప్రశ్నించిందన్నారు. అక్రమ నియామకాల్ని వెంటనే నిలిపివేయాలంటూ స్టే ఇచ్చినట్లు వెల్లడించారు. ఉద్యోగ నియామకాల పేరిట రూ.కోట్లు దండుకుని, నిరుద్యోగుల్ని మోసం చేసిన దాసకి యాకోబ్, రతన్‌కుమార్‌తో పాటు వారి అనుచరులపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. బైలా ప్రకారం ఎడ్యుకేషన్ కమిటీ అనే సంస్థే లేదని, అది కల్పితమని, బోర్డు ఆఫ్ ఎడ్యుకేషన్ మాత్రమే చట్టబద్ధమైందన్నారు.

రైతు బజార్లపై 'కూటమి గద్దలు'!

- 100 డ్వాక్రా, దివ్యాంగుల స్టాళ్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం
- విశాఖ, అనకాపల్లి జిల్లాల నుంచి 350 దరఖాస్తులు
- కూటమి నేతల వసూళ్ల పర్వం
- చక్రం తిప్పుతున్న ఓ ఎమ్మెల్యే పీఏ
- సిఫార్సులతో అధికారుల మల్లగుల్లాలు



విశాఖ విద్య : రైతు బజార్లపై కూటమి నేతలు గద్దల్లా వాలిపోతున్నారు. నగరంలోని రైతుబజార్లలో త్వరలో కేటాయించబోయే స్టాళ్లను చేజిక్కించుకునేలా తమ అనుచరులను రంగంలోకి దింపారు. వీటిని తమ వ్యాపార కేంద్రాలుగా మార్చేందుకు కూటమి నేతలు రాజకీయం చేస్తుండటం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. జిల్లాలో 13 రైతు బజార్లు ఉన్నాయి. వీటిలో 1,350 వరకు స్టాళ్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో డ్వాక్రా, దివ్యాంగులకు 220 స్టాళ్లు కేటాయించారు. ఇక్కడ దుకాణాల నిర్వహణకు విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని రైతులు, డ్వాక్రా సంఘాల సభ్యులకు గుర్తింపు కార్డులు ఇస్తున్నారు. ఇలా ఇప్పటివరకు 2 వేలు కార్డులు జారీ చేశారు. మరో ఏడు వందల మందికి పైగా తమకు దుకాణాలు కేటాయించాలని దరఖాస్తు చేసుకున్నారు. రైతు కార్డులకు శాశ్వత గుర్తింపు ఉండగా, డ్వాక్రా, దివ్యాంగులకు మూడేళ్ల కాలవ్యవధితో దుకాణాల నిర్వహణకు అవకాశం కల్పిస్తారు.

100 స్టాళ్లకు నోటిఫికేషన్

జిల్లాలో అన్ని రైతుబజార్లలో డ్వాక్రా, దివ్యాంగులకు సంబంధించి 98 స్టాళ్లు, కొత్తగా ఏర్పాటు చేసిన చిట్టివలస రైతు బజారులోని 2 స్టాళ్లు కలుపుకొని మొత్తంగా 100 స్టాళ్ల(డ్వాక్రా–71, దివ్యాంగులు–29) నిర్వహణకు (మూడేళ్ల వ్యవధితో కార్డుల జారీ) ఈ నెల 2న నోటిఫికేషన్ జారీ చేశారు. గడువు ఈ నెల 31తో ముగియనుండగా ఇప్పటివరకు 350 మంది దరఖాస్తు చేసుకున్నారు. అలాగే జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో లాటరీ ద్వారా అర్హులైన వారిని ఎంపిక చేయాల్సి ఉంది.

భారీగా చేతులు మారుతున్న డబ్బులు

రైతు బజారులో దుకాణాల నిర్వహణ లాభసాటిగా ఉంటుంది. సీతమ్మధార, ఎంవీపీ కాలనీ, కంచరపాలెం వంటి చోట్ల ఒక్కో స్టాల్‌లో రోజుకు రూ.30 వేలు పైనే అమ్మకాలు సాగుతాయి. గోపాలపట్నం, గాజువాక, పెదవాల్తేరు, స్టీల్‌ప్లాంట్, పెందుర్తి, మధురవాడ వంటి రైతుబజార్లలో తాము చెప్పిన వారికి స్టాల్ దక్కేలా కూటమి నేతలు స్కెచ్ వేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. విశాఖ జిల్లాలోని ఓ ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు(పీఏ) గోపాలపట్నంలోని మార్కెటింగ్ శాఖ కార్యాలయంలోనే తిష్టవేసి.. ఈ తతంగాన్ని నడిపిస్తున్నాడనే ప్రచారం సాగుతోంది. ఇందుకు భారీగా డబ్బులు చేతులు మారుతున్నట్లు తెలుస్తోంది. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న తమ లాంటి వారికి అవకాశం దక్కకుండా కూటమి నాయకులు కుయుక్తులు పన్నుతుండటంపై దరఖాస్తుదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరిగేలా ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

పైరవీల జాతర

లాటరీ ప్రక్రియకు ముందే దరఖాస్తుదారుల్లో అర్హులెవరెనేది నిశిత పరిశీలన చేయాల్సి ఉంది. బైలా ప్రకారం మనుగడలో ఉన్న డ్వాక్రా సంఘాలనే పరిగణలోకి తీసుకోవాలి. పరిశీలన నిమిత్తం మార్కెటింగ్ శాఖ అధికారులు, అనకాపల్లి డీఆర్‌డీఏ అధికారులకు 143, విశాఖ డీఆర్‌డీఏ అధికారులకు 40, జీవీఎంసీలోని యూసీడీ విభాగానికి 167 దరఖాస్తులను పంపించారు. ఇక్కడ నుంచే పైరవీల జాతర మొదలైందనే ప్రచారం సాగుతోంది. తమ అనుచరుల పేర్లు మాత్రమే లాటరీలో ఉండేలా వడపోత సాగాలని కూటమి నేతలు సిఫార్సు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.



సృష్టి ఫెర్టిలిటీ రీసెర్చ్ సెంటర్

సృష్టి రహస్యాలెన్నో..

- ఐవీఎఫ్‌లో కలకలం
- పిల్లలు లేని దంపతులే లక్ష్యం
- భారీగా వసూళ్ల పర్వం
- లోపించిన వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షణ
- వివాదాలకు కేంద్రబిందువుగా మారిన ఐవీఎఫ్ సెంటర్లు

మహారాణిపేట: పిల్లలు లేని దంపతులను లక్ష్యంగా చేసుకుని, సరోగసీ (అద్దె గర్భం), ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) కేంద్రాలు భారీగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాయి. మాతృత్వపు ఆనందాన్ని అందిస్తున్న ఈ పద్ధతులను కొన్ని సంస్థలు సొమ్ము చేసుకునే మార్గంగా చూస్తూ మహిళల నుంచి అడ్డగోలుగా డబ్బు దోచుకుంటున్నాయి. గతంలో ఐవీఎఫ్ కేంద్రాలు ఇష్టానుసారం సరోగసీని ఉపయోగించుకుని డబ్బులు దండుకున్నాయని అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి. నగరంలోని 'సృష్టి ఐవీఎఫ్' సెంటర్ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. సరోగసీ, ఐవీఎఫ్ సేవలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మార్గదర్శకాలు రూపొందించి నియంత్రిస్తున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నుంచి అనుమతులు పొంది మాత్రమే ఈ కేంద్రాలను నడపాలి. జిల్లాలో 41 ఐవీఎఫ్, 9 సరోగసీ కేంద్రాలు సహా మొత్తం 50 కేంద్రాలు పనిచేస్తున్నట్లు సమాచారం.

టెస్ట్ ట్యూబ్ బేబీ

సహజ పద్ధతిలో గర్భధారణ కానివారికి లేదా పురుషులలో వీర్య కణాల నాణ్యత తక్కువగా ఉన్నప్పుడు వైద్యులు ఐవీఎఫ్ పద్ధతిని సూచిస్తారు. సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల్లో ఏఆర్‌టీ (అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ) బ్యాంక్, ఎల్–1, ఎల్–2 విభాగాలు ఉంటాయి. వీటి కోసం వరుసగా రూ.50వేలు, రూ.50వేలు, రూ. 2 లక్షలు డిపాజిట్/డీడీ సమర్పించాలి. దరఖాస్తుతో పాటు సదుపాయాలు, వైద్యుల వివరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి సమర్పించాలి.

కలెక్టర్ అధ్యక్షతన కమిటీలు

కలెక్టర్ అధ్యక్షతన సరోగసీ, ఐవీఎఫ్ పర్యవేక్షణ కోసం కమిటీలు ఏర్పాటు చేశారు. వీటిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ప్రసూతి, పిల్లల వైద్య విభాగాల అధిపతులు, పోలీసు కమిషనర్, సెషన్స్ జడ్జి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రముఖ గైనకాలజిస్టులు సభ్యులుగా ఉంటారు. సరోగసీకి కలెక్టర్, ఐవీఎఫ్‌కు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది.

'సృష్టి' అక్రమాలు, నిబంధనల ఉల్లంఘన

జిల్లా పరిషత్ సమీపంలోని 'సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్' వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. ఈ కేంద్రం 2018 నుంచి 2023 వరకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో నమోదైంది. ఆ తర్వాత ఎలాంటి రిజిస్ట్రేషన్ లేకుండానే అనధికారికంగా నడుస్తోంది. డాక్టర్ నమ్రత ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ కేంద్రంపై విశాఖ, విజయవాడ, గుంటూరు, హైదరాబాద్‌లలో కేసులు నమోదయ్యాయి. మేనేజర్ కల్యాణికి ఇందులో కీలక పాత్ర ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

ఢిల్లీ నుంచి తీసుకొచ్చి విశాఖలో డెలివరీ

గత నెలలో ఈ కేంద్రంలో డెలివరీ అయిన మగబిడ్డ విషయంలో అక్రమాలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. వేరే మహిళకు పుట్టిన బిడ్డను తీసుకువచ్చి సరోగసీ ద్వారా పుట్టినట్లు దంపతులను నమ్మించారు. ఢిల్లీకి చెందిన గర్భిణిని విమానంలో విశాఖకు తీసుకొచ్చి డెలివరీ చేయించారని పోలీసులు అనుమానిస్తున్నారు. డాక్టర్ నమ్రత గతంలో కోట్లాది రూపాయల దందా చేసి, ఒక బిడ్డను రూ.30 లక్షలకు విక్రయించారని పోలీసులు చెబుతున్నారు.

అక్రమ వసూళ్లు, పర్యవేక్షణ లోపం

నగరంలో ఐవీఎఫ్, సరోగసీ కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే ఈ కేంద్రాలు పనిచేస్తున్నాయి. కొందరు అధికారులకు లంచాలు ఇచ్చి యథేచ్ఛగా నడుపుతున్నా పట్టించుకునేవారు లేరు. ఒక కేసు నుంచి రూ. 20 లక్షల నుంచి రూ. 40 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. డబ్బులు ఎక్కువగా ఉన్నవారి నుంచి వివిధ రకాల ఫీజుల పేరుతో దోచుకుంటున్నారు. వివాహం జరిగి చాలా ఏళ్లు పిల్లలు లేని తల్లుల నుంచి పెద్ద మొత్తంలో అక్రమ వసూళ్లు చేస్తున్నారు. దీనికి ఎలాంటి బిల్లులు, లెక్కలు ఉండటం లేదు. ఈ కేంద్రాలపై వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షణ కొరవడుతోందని స్పష్టమవుతోంది.

నమోదు తప్పనిసరి



సరోగసీ, ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) సేవలందించే కేంద్రాలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. అలాగే నమోదు కోసం నిర్దేశించిన రుసుములను సకాలంలో చెల్లించాలి. రుసుము చెల్లింపులో జాప్యం చేసే దరఖాస్తులను తిరస్కరిస్తాం. అనుమతులు పొందిన తర్వాత మాత్రమే సరోగసీ, ఐవీఎఫ్ ప్రక్రియలను ప్రారంభించాలి. ప్రస్తుతం దరఖాస్తు చేసుకోని ఏఆర్‌టీ సెంటర్లను కూడా సీజ్ చేస్తాం. అటువంటి సెంటర్లకు నోటీసులు జారీ చేసి, వారి సేవలను నిలుపుదల చేసి, ప్రీ–కాన్సెప్షన్ అండ్ ప్రీ–నేటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ యాక్ట్ 1994 కింద కఠిన చర్యలు తీసుకుంటాం

–డాక్టర్ పి.జగదీశ్వరరావు, డీఎంహెచ్‌వో

కష్టపడుతున్నా.. కడుపు నిండట్లేదు

- దీనావస్థలో ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు
- చాలీచాలని జీతంతో నిత్యం వెతలే..
- నెలకు రూ.16 వేలు వేతనమని చెప్పి.. రూ.12 వేలే ఇస్తున్న కాంట్రాక్టర్
- నష్టపోతున్న సుమారు 600 మంది కార్మికులు



బాత్‌రూమ్‌లు శుభ్రం చేస్తున్న కార్మికుడు



విమ్స్‌లో వార్డులు శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికురాలు



కేజీహెచ్ మెయిన్ గేట్ వద్ద నిరసన తెలుపుతున్న సిటు నాయకులు, పారిశుధ్య కార్మికులు (ఫైల్)

డాబాగార్డెన్స్ : ఇంట్లో ఎవరికైనా అనారోగ్యం సోకి మంచాన పడితే సొంత మనుషులే సేవ చేయలేని రోజులివి. అన్నీ మంచం మీదే చేయాల్సి వస్తే మరింత యాతన. అలాంటి రోగులను కూడా సొంత మనుషుల కంటే మిన్నగా చూసుకునే బడుగుజీవులు వారు. బతుకుతెరువు కోసం దుర్భరమైన.. క్లిష్టమైన వృత్తిలో కొనసాగుతున్నారు. వారికిచ్చే వేతనాలు అంతంతమాత్రమే. ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులు, రోగుల సంరక్షకుల దుస్థితి ఇది.

విధులకు తగ్గ వేతనం ఏదీ?

రోగులకు అమ్మలా అన్నం తినిపిస్తారు. వేళకు మందులిస్తారు. దగ్గరుండి బాత్రూమ్‌కు తీసుకెళ్తారు. రోగులు వాంతులు.. మల మూత్రాదులు చేస్తే శుభ్రం చేస్తారు. ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచుతారు. వాడి పడేసిన సిరంజిలు, ఇంజక్షన్లు తదితర ప్రమాదకరమైన బయో వ్యర్థాలు బయటికి తరలిస్తారు. ఇలా నెలలో 30 రోజులూ గైర్హాజరీ లేకుండా పనిచేస్తే.. వారికిచ్చే వేతనం కోతలు పోనూ కేవలం రూ.12 వేలు. ఇలా కేజీహెచ్, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి, ఈఎన్‌టీ, ప్రభుత్వ ఛాతీ, ప్రభుత్వ మానసిక, రీజినల్ ఐ ఆస్పత్రుల్లో కాంట్రాక్ట్/ఒప్పంద కార్మికులు పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నా వారిలో సగం జీతం కూడా అందడం లేదు.

గత ప్రభుత్వంలో ఇచ్చిన హామీ ఇలా..

ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 2021లో టెండర్లు పిలిచినప్పుడు నెలకు రూ.16 వేలు (ఈఎస్ఐ, పీఎఫ్ పోను) ఇచ్చేందుకు కాంట్రాక్టర్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. కొన్నాళ్లు రూ.11 వేలు మాత్రమే ఇవ్వగా.. ఆరు నెలల క్రితం సిబ్బంది పెద్ద ఎత్తున ఉద్యమ బాట పట్టడంతో మరో వెయ్యి పెంచాడు. ప్రస్తుతం వారికి రూ.12 వేలు మాత్రమే జీతం ఇస్తున్నాడు. మిగిలిన రూ.4 వేలు కాంట్రాక్టర్ జేబులోకి వెళ్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయాన్ని కార్మిక సంఘాలు కలెక్టర్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా స్పందన లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా.. ఈఎస్ఐ, పీఎఫ్ విషయానికొస్తే 12 శాతం సిబ్బంది జీతానికి యజమాని 12 శాతం కలిపి పీఎఫ్‌కు జమ చేయాలి. కానీ మొత్తం 24 శాతం సిబ్బంది నుంచే కలెక్ట్ చేసినా.. పీఎఫ్‌కి సక్రమంగా కట్టడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేజీహెచ్, ప్రభుత్వ విక్టోరియా, ఈఎన్‌టీ, ప్రభుత్వ ఛాతీ, ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో సుమారు 600 మంది శానిటేషన్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. కేజీహెచ్‌లో 275 మంది ఉండగా.. మిగిలిన అన్ని ఆస్పత్రుల్లో 300కు పైబడి సిబ్బంది పనిచేస్తున్నారు.

ఇల్లు గడవడమే కష్టం..

ఐదేళ్లుగా కేజీహెచ్‌లో శానిటేషన్ ఉద్యోగిగా పనిచేస్తున్నాను. నెలకు రూ.12 వేలు ఇస్తున్నారు. కోతలు పోను దంపతులిద్దరం పనిచేసినా కుటుంబం గడవడమే కష్టంగా ఉంది.

– రవణమ్మ, శానిటేషన్ ఉద్యోగి, కేజీహెచ్

వేతనానికి ఎదురు చూపులే..

ఆరేడేళ్లుగా పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్నాను. అద్దె ఇంట్లో ఉంటున్నాం. నెల వేతనం సరిగ్గా చెల్లించకపోవడంతో కుటుంబం గడవక అప్పులు చేయాల్సి వస్తోంది.

– లక్ష్మి, శానిటేషన్ ఉద్యోగి, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి

సక్రమంగా జీతాలు ఇవ్వకపోతే ఎలా?



కేజీహెచ్ అధికారులు కాంట్రాక్టర్‌కు బిల్లులు మంజూరు చేస్తూ జేబులు నింపుతున్నారు. 275 మంది శానిటేషన్ సిబ్బంది ఉండాలి. కానీ 240 మంది మాత్రమే ఉన్నారని రాతపూర్వకంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి రెండు నెలలు కావస్తున్నా కనీసం విచారణ చేయలేదు. శానిటేషన్ కాంట్రాక్టర్ కాల పరిధి ముగిసినా, అదే కాంట్రాక్టర్‌ని మరలా కొనసాగించడంలో అర్థమేంటో అధికారులే చెప్పాలి. ఓ పక్క కాంట్రాక్టర్ కార్మికుల శ్రమను దోచుకుంటూ ప్రభుత్వాన్ని మోసం చేస్తూ ప్రజాధనం లూటీ చేస్తుంటే అధికారులు కళ్లప్పగించి చూడడం అన్యాయం.

– కె.చంద్రశేఖర్, జగదాంబ జోన్ సీపీఎం నాయకుడు

ఒప్పందం ప్రకారం జీతాలు చెల్లించాలి..



శానిటేషన్ కాంట్రాక్టర్ 2021లో రూ.16 వేలు జీతం ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్టు రాతపూర్వకంగా తెలిపాడు. కానీ రూ.11 వేలు మాత్రమే ఇచ్చేవాడు. సిటు పోరాటాల ఫలితంగా వెయ్యి పెంచారు. ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం రూ.16 వేల జీతం శానిటేషన్ వర్కర్లకు ఇవ్వాలి (జీవో 549). ఈఎస్ఐ, పీఎఫ్ సక్రమంగా కట్టాలి. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తాం.

– పి.వెంకట్రావు, సిటు నాయకుడు

తిలా పాపం.. తలా పిడికెడు

- వీవీవీ ఉపాధ్యాయుడి మృతికి బాధ్యులెవరు?
- ఆరు నెలలుగా జీతాల్లేక.. సకాలంలో వైద్యం చేయించుకోలేని ఉపాధ్యాయుడు
- మల్లాది రవిమోహన్ మృతితో ఉపాధ్యాయుల్లో ఆందోళన





రవిమోహన్ (ఫైల్)

గాజువాక : పెదగంట్యాడలోని విశాఖ విమల విద్యాలయం (వీవీవీ) క్యాంపస్‌లో ఇంగ్లిష్ టీచర్ మల్లాది రవి మోహన్ నిమోనియాతో మరణించడం ఆ పాఠశాల ఉపాధ్యాయుల్లో తీవ్ర ఆందోళన రేపింది. ఆరు నెలలుగా జీతాలు లేకపోవడంతో రవి మోహన్ సకాలంలో సరైన వైద్యం చేయించుకోలేక పోయారని ఆయన సహోద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య ఖర్చులు భరించలేక చివరికి కేజీహెచ్‌లో చేరి..అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. పెదగంట్యాడలో వీవీవీ నడుస్తున్నప్పటికీ అక్కడ జీతాలు ఇవ్వడం లేదు..ప్రధాన క్యాంపస్ ఉక్కునగరంలో ఉంది. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నేపథ్యంలో ఈ పాఠశాలను మాజమాన్యం మూసివేసింది. దీని ఫలితంగా దశాబ్దాల కాలంగా పని చేస్తున్న ఉపాధ్యాయులకు జీతాలు నిలిపివేశారని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. పాఠశాల కొనసాగింపు, జీతాల చెల్లింపు కోసం ఉపాధ్యాయులు స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలను ఇటీవల ఉపాధ్యాయులు కలిశారు. అయితే పాఠశాల కొనసాగింపుపై స్పందించని ఆ ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులకు వీఆర్ఎస్ (స్వచ్ఛంద పదవీ విరమణ) ఇచ్చి పంపించేయాలని సిఫార్సు చేస్తూ లేఖలు ఇవ్వడం ఉపాధ్యాయులను నివ్వెరపరిచింది. ఈ లేఖలు రవి మోహన్‌లాంటి ఉపాధ్యాయులకు అశనిపాతంగా మారాయని పాఠశాల వర్గాలు పేర్కొన్నాయి.

ఇదీ పాఠశాల చరిత్ర : సుమారు నాలుగు దశాబ్దాల క్రితం విశాఖ విమల విద్యాలయం ప్రారంభమైంది. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల పిల్లల విద్యావసరాలను తీర్చడానికి ఈ తెలుగు మీడియం పాఠశాలను స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం స్థాపించింది. దీని నిర్వహణ బాధ్యతలను నగరంలోని డయాసిస్ సంస్థకు అప్పగించారు. ఈ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు గతంలో రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా వేతనాలు చెల్లించేవారు. ప్రతి సంవత్సరం సుమారు రెండు వేల మంది విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు. ప్రస్తుతం, పాఠశాలలో 28 మంది శాశ్వత ఉపాధ్యాయులు, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, మరియు 60 మంది ఇతర సిబ్బంది పనిచేస్తున్నారు. పాఠశాల నిర్వహణకు ఏటా దాదాపు రూ. 5 కోట్లు ఖర్చవుతుంది. ఇందులో రూ. 2 కోట్లు ఫీజుల రూపంలో వసూలవుతాయి, మిగిలిన మొత్తాన్ని ఉక్కు యాజమాన్యం అందిస్తుంది.

జరుగుతున్న కథ ఇది.. : ఉక్కునగరంలోని విశాఖ విమల విద్యాలయం సంక్షోభంలో కూరుకుపోయింది. జీతాలు లేక ఇంగ్లిష్ టీచర్ మల్లాది రవి మోహన్ నిమోనియాతో మృతి చెందడం పరిస్థితిని మరింత దిగజార్చింది. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం పాఠశాల నిర్వహణకు నిరాకరించడంతో ఈ పరిస్థితి తలెత్తింది. పాఠశాలను తిరిగి తెరవాలని కోరుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన చేస్తున్నా, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు వీఆర్ఎస్ సిఫార్సు లేఖలు ఇవ్వడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రవి మోహన్ మృతికి జీతాల బకాయిలే కారణమని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పలు రైళ్ల రద్దు.. మరికొన్ని దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: సంబల్‌పూర్ స్టేషన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు, మరికొన్ని దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. సంబల్‌పూర్-రాయగడ-సంబల్‌పూర్ (18301/18302) ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 7వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఇరువైపులా రద్దు చేశారు. ఆగస్టు 8, 10, 11, 15వ తేదీల్లో సంబల్‌పూర్-నాందేడ్(20809) నాగావళి ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 9, 11, 12, 16వ తేదీల్లో నాందేడ్-సంబల్‌పూర్ (20810) నాగావళి ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 10, 13వ తేదీల్లో విశాఖపట్నం-బనారస్ (18523) బై వీక్లీ ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 11, 14వ తేదీల్లో బనారస్-విశాఖపట్నం (18524) బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.

దారి మళ్లించిన రైళ్లు

- ఆగస్టు 8 నుంచి 14వ తేదీ వరకు టాటానగర్-ఎర్నాకుళం(18189) ఎక్స్‌ప్రెస్ వయా ఝార్సుగూడ రోడ్, సంబల్‌పూర్‌సిటీ, నరాజ్ మార్తాపూర్, అంగుల్, ఖుర్దారోడ్, విజయనగరం మీదుగా నడుస్తుంది.
- ఆగస్టు 7 నుంచి 13వ తేదీ వరకు ఎర్నాకుళం-టాటానగర్ (18190) ఎక్స్‌ప్రెస్ వయా విజయనగరం, ఖుర్దారోడ్, అంగుల్, నరాజ్ మార్తాపూర్, సంబల్‌పూర్‌సిటీ, ఝార్సుగూడ రోడ్ మీదుగా నడుస్తుంది.
- ఆగస్టు 9న తాంబరం-జసిద్ది(12375) ఎక్స్‌ప్రెస్ వయా విజయనగరం, ఖుర్దారోడ్, అంగుల్, నరాజ్ మార్తాపూర్, సంబల్‌పూర్‌సిటీ, ఝార్సుగూడ రోడ్ మీదుగా నడుస్తుంది.
- ఆగస్టు 13న జసిద్ది-తాంబరం (12376) ఎక్స్‌ప్రెస్ వయా ఝార్సుగూడ రోడ్, సంబల్‌పూర్‌సిటీ, నరాజ్ మార్తాపూర్, అంగుల్, ఖుర్దారోడ్, విజయనగరం మీదుగా నడుస్తుంది.
- ఆగస్టు 8న టాటానగర్ -ఎస్ఎంవిటీ బెంగళూరు (12889) ఎక్స్‌ప్రెస్ వయా ఝార్సుగూడ రోడ్, సంబల్‌పూర్ సిటీ, నరాజ్ మార్తాపూర్, అంగుల్, ఖుర్దారోడ్, విజయనగరం మీదుగా నడుస్తుంది.
- ఆగస్టు 11న ఎస్ఎంవీటీ బెంగళూరు-టాటానగర్ (12890) ఎక్స్‌ప్రెస్ వయా విజయనగరం, ఖుర్దారోడ్, అంగుల్, నరాజ్ మార్తాపూర్, సంబల్‌పూర్‌సిటీ, ఝార్సుగూడ రోడ్ మీదుగా నడుస్తుంది.
- ఆగస్టు 12న ఎస్ఎంవీటీ బెంగళూరు -హతియా(12836) ఎక్స్‌ప్రెస్ వయా విజయనగరం, ఖుర్దారోడ్, అంగుల్, నరాజ్ మార్తాపూర్, సంబల్‌పూర్‌సిటీ, ఝార్సుగూడ రోడ్ మీదుగా నడుస్తుంది.

న్యాయవాది పరిషత్ రాష్ట్ర అధ్యక్షునిగా అశ్విని కుమార్



విశాఖ లీగల్ : న్యాయవాది పరిషత్ రాష్ట్ర అధ్యక్షునిగా నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది ద్రోణంరాజు అశ్విని కుమార్ ఎన్నికయ్యారు. ఆదివారం తిరుపతిలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో అశ్విని కుమార్‌ని రాష్ట్ర అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అశ్విని కుమార్ నియామకం పట్ల విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎంకే శ్రీనివాస్, కార్యదర్శి పార్వతీశ్వర నాయుడు అభినందనలు తెలిపారు. గత 22 ఏళ్లుగా అశ్విని కుమార్ విశాఖ న్యాయవాద సంఘం సభ్యుడిగా కొనసాగుతున్నారు. సీనియర్ న్యాయవాది హోదాలో పలు సంస్థలకు న్యాయ సలహాదారులుగా ఉన్నారు.

మతోన్మాద, కార్పొరేట్ శక్తుల దాడిపై పోరాటం

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు

కంచరపాలెం: దేశంలో మతోన్మాద, కార్పొరేట్ శక్తుల దాడిని కార్మిక వర్గం ఐక్యంగా ఎదుర్కోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. కంచరపాలెంలోని ఓ కమ్యూనిటీ హాల్‌లో రెండు రోజుల పాటు జరిగిన సీఐటీయూ జిల్లా 13వ మహాసభలు ఆదివారం ముగిశాయి. ముఖ్య అతిథిగా హాజరైన నర్సింగరావు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మేయడానికి కేంద్ర ప్రభుత్వం పూనుకుంటే, గత 1600 రోజులుగా కార్మిక వర్గం పోరాడి అడ్డుకోగలిగిందని గుర్తు చేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, ప్రజలపై భారం మోపే సర్దుబాటు, ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని తీర్మానం ప్రవేశపెట్టారు. డిసెంబర్ 31 నుంచి వచ్చే ఏడాది జనవరి 4 వరకు అఖిల భారత సీఐటీయూ 18వ మహాసభలు జరగనున్నట్లు నర్సింగరావు తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టేందుకు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలిసి ప్రచారం చేపట్టాలని సీఐటీయూ నాయకులను, కార్యకర్తలను ఆయన కోరారు. కార్యక్రమంలో కె. లోకనాథం, ఆర్. శంకరరావు, ఎం. శ్రీనివాస్, పి. మణి, పి. వెంకటరెడ్డి, ఎం. సుబ్బారావు, ఎల్.జె. నాయుడు, ఒమ్మి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

22 కిలోల గంజాయి స్వాధీనం

గోపాలపట్నం : గంజాయి తరలిస్తున్న ఇద్దరు మహిళలను నార్త్ సింహాచలం రైల్వే స్టేషన్ దరి క్వార్టర్స్ వద్ద పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వారి నుంచి 22 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఎస్.వి.ప్రభాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గంజాయి తరలిస్తున్నారన్న సమాచారం మేరకు గోపాలపట్నం పోలీసులు నార్త్ సింహాచలం రైల్వే స్టేషన్ సమీపంలో క్వార్టర్స్ వద్ద కాపలా కాశారు. అటుగా వస్తున్న ఇద్దరు మహిళల వద్ద గల సూట్ కేసులను తనిఖీ చేయగా 22 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. ఒడిశా రాష్ట్రం పడువాకు చెందిన వారిని అదుపులోకి తీసుకొని విచారించగా.. విశాఖలో కొందరికి గంజాయి అందించేందుకు వచ్చారని పోలీసులు తెలిపారు. ఎవరికి విక్రయించేందుకు వచ్చారు.. వారి వెనుక ఎవరున్నారన్న అంశాలపై ఆరా తీస్తున్నామని పేర్కొన్నారు. వారిని కోర్టు ముందు హాజరు పరిచి రిమాండ్‌కు తరలించనున్నామని తెలిపారు.

శివయ్యకు కావిళ్లతో గంగ కాలినడకన ప్రయాణం



జాతీయ రహదారిపై కావడి యాత్ర





మద్దిపాలెం: హిందువులకు అత్యంత పవిత్రమైన శ్రావణమాసం. శివభక్తులు పరమశివుడి ఆశీర్వాదం కోసం 'కన్వర్ యాత్ర' (కావడి యాత్ర)ను ఆదివారం మార్వాడీలు విశాఖలో నిర్వహించారు. కన్వర్ అనేది వెదురుతో చేసిన ఒక కావడి, దీనికి ఇరువైపులా కుండలు కట్టి గంగా జలాన్ని మోసుకెళ్తారు. ఈ యాత్రలో పాల్గొనే భక్తులను కన్వరియాలు అంటారు. వీరు కాషాయ వస్త్రాలు ధరించి మాధవధారలోని జలధార నుంచి పవిత్ర జలాలను సేకరించి.. శివాలయాల్లోని శివలింగాలకు అభిషేకం చేశారు. పరమశివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన శ్రావణమాసంలో గంగాజలంతో అభిషేకం చేయడం వల్ల కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారు. ఆదివారం మాధవధారలోని 'దార' వద్ద మార్వాడీల కావడి యాత్ర ఘనంగా ప్రారంభమైంది. మాధవధారలోని 'జలధార' నుంచి నీటిని సేకరించి, వాటిని కావడిలో మోసుకుంటూ శివుడిని స్తుతిస్తూ యాత్రగా బయలుదేరారు. మాధవధార, మురళీనగర్, బిర్లా జంక్షన్ మీదుగా వందలాది మంది మార్వాడీలు ఈ యాత్రలో పాల్గొన్నారు. చివరగా, వారు బీచ్‌లోని శివాలయం చేరుకొని, సేకరించిన జలాలతో శివుడికి అభిషేకం చేస్తారు. ఈ యాత్ర భక్తి పారవశ్యంతో సాగింది.

కవి ప్రధాన లక్ష్యం సమాజ శ్రేయస్సు



కవి సమ్మేళనంలో పాల్గొన్న అతిథులు, నిర్వాహకులు

తాటిచెట్లపాలెం: తెలుగు సాహిత్య అభిమానులకు, కవితా ప్రకటనకు శ్రీశ్రీ కళావేదిక ఒక గొప్ప వేదికగా నిలుస్తోందని శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కట్టిమండ ప్రతాప్ అన్నారు. సంస్థ జిల్లా అధ్యక్షుడు కొలిచిన రామ జగన్నాథ్ ఆధ్వర్యంలో ఆదివారం రైల్వేస్టేషన్ సమీపంలోని శుభం ఫంక్షన్ హాల్‌లో సంస్థ 150వ సాహిత్య కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రతాప్ మాట్లాడుతూ కవి ప్రధాన లక్ష్యం సమాజ శ్రేయస్సు కోరుకోవడమేనన్నారు. ఈ కాలంలో కవిత్వం ప్రజల మనోభావాలకు ప్రతినిధిగా నిలవాలని, సమాజంలో మార్పుకు దారి తీసే శక్తిగా సాహిత్యం ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విశ్వభారత్ డైరెక్టర్ బలివాడ రమేష్ మాట్లాడుతూ వచ్చే సంక్రాంతికి విజయనగరం జిల్లా గరివిడిలో శ్రీశ్రీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు బహుభాషా కవి సమ్మేళనం ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమ్మేళనంలో విశాఖ నగరంతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల నుంచి వచ్చిన సుమారు 150 మంది కవులను ప్రశంసాపత్రం, శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. సమకాలీన రాజకీయాలు, మానవతా విలువలు, ప్రకృతి సంరక్షణ, మహిళా సాధికారత వంటి విభిన్న అంశాలపై కవులు తమ కవితలు వినిపించారు.

చికెన్ వ్యర్థాల వాహనాల పట్టివేత



పట్టుబడిన వాహనాలతో డ్రైవర్లు

అనకాపల్లి : స్థానిక జాతీయ రహదారి డైట్ కళాశాల వద్ద పట్టణ పోలీసులు ఆదివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా విశాఖ ఉమ్మడి జిల్లా నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలకు 5 బోలేరో వాహనాలలో చేపల మేత, చికెన్ వ్యర్థాలు రవాణా చేస్తుండగా పట్టుకున్నారు. విశాఖలో ఎన్ఏడీ, అక్కయ్యపాలెం, ఇతర ప్రాంతాల నుంచి వ్యర్థాలను సేకరించి తీసుకువెళుతున్నారని పోలీసులు తెలిపారు. వాహన డ్రైవర్లు బడపాటి నాగబాబు, జయమంగళ సత్యనారాయణ, బుడుమూరు బాలాసు బ్రహ్మణ్యం, మేడిశెట్టి నూకరాజు, బద్ది నాగ సత్యనారాయణలను అదుపులోనికి తీసుకుని అనకాపల్లి జోనల్ కమిషనర్ చక్రధర్‌కు అప్పగించారు. పట్టుకున్న వ్యర్థాలను విశాఖ కాపులుప్పాడలో డంపింగ్‌యార్డులో పూడ్చి, ప్రధాన కమిషనర్ ఆదేశాల మేరకు కేసులు నమోదు చేయడం జరుగుతుందని జోనల్ కమిషనర్ తెలిపారు.

సంకల్పమే శ్వాసగా..

జిల్లా పారా అథ్లెట్స్ జట్ల ఎంపికలో స్ఫూర్తి చాటుకున్న దివ్యాంగులు







విశాఖ స్పోర్ట్స్ : ఆంధ్ర యూనివర్సిటీ గ్రౌండ్స్‌లో ఆదివారం జరిగిన అంతర జిల్లాల పారా అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక క్రీడా స్ఫూర్తికి వేదికైంది. జూనియర్ (19 ఏళ్ల లోపు), సబ్-జూనియర్ (17 ఏళ్ల లోపు) విభాగాల్లో దాదాపు 70 మంది దివ్యాంగ బాలబాలికలు తమ అసాధారణ ప్రతిభను ప్రదర్శించారు. ముఖ్యంగా 11-13 అంశాల పరుగు విభాగంలో సహాయకుల తోడుతో ట్రాక్‌లో పరుగెత్తుతూ 'తగ్గేదేలే' అంటూ వారు చూపిన సంకల్పం అందరినీ ఆకట్టుకుంది. ఫీల్డ్ ఈవెంట్లలో, ముఖ్యంగా త్రోస్ అంశాల్లో కూడా అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శించారు. బధిరులు, మేధో వైకల్యం గల బాలబాలికలు సైతం ఎంతో ఉత్సాహంగా ఈ పోటీలలో పాలుపంచుకున్నారు. వారి ముఖాల్లో కనిపించిన ఆనందం, విజయకాంక్ష, క్రీడలపై వారికున్న నిబద్ధత నిజంగా స్ఫూర్తిదాయకం. ఈ ఎంపిక పోటీలు కేవలం ఆటలకే పరిమితం కాలేదు, తమ కలలను సాకారం చేసుకోవడానికి ప్రత్యేక అవసరాలు గల వ్యక్తులు ఎంతటి కృషి చేయగలరో నిరూపించాయి.